# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 27 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉపాధ్యాయ లోకానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగన్నతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం కీలక నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత ఫైలుపై సంతకం చేయడంతో పదోన్నతుల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. వచ్చే రెండు రోజుల లోపు అధికారిక షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,000 మంది అర్హులైన ఉపాధ్యాయులు పదోన్నతికి దక్కుతారు. స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతికి అర్హత సాధించనున్నారు. ప్రస్తుతం దాదాపు 750 హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, ఇవి పదోన్నతుల ద్వారానే భర్తీ చేయనున్నారు. ఈ నియామకాల వల్ల ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ల స్థానాలను సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) భర్తీ చేయనున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఇప్పుడు ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణను ప్రారంభించింది. ఉపాధ్యాయ లోకం ఈ నిర్ణయాన్ని హర్షంగా స్వాగతిస్తోంది.




## రాజకీయాలకతీతంగా అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ పార్లమెంటు పరిధిలో అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తామని, రాజకీయాలకు తావులేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేస్తూ ఆయన ప్రసంగించారు. విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలకగా, పలు విద్యార్థినులు రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీలు కట్టారు.

"ప్రధాని మోదీ సూచన మేరకే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో ఉచిత సైకిళ్లను అందజేస్తున్నాం. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో పంపిణీ పూర్తయింది. ప్రస్తుతం హుస్నాబాద్ నియోజకవర్గంలో నాలుగో విడతగా పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఏడాది ఈ పంపిణీ కొనసాగుతుంది," అని ఆయన వివరించారు. త్వరలోనే నర్సరీ నుంచి ఆరో తరగతి విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, నోట్ బుక్స్, పెన్నులు, మోదీ కిట్స్ అందజేస్తామని తెలిపారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామని బండి సంజయ్ వెల్లడించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి సైకిళ్ల గిఫ్ట్‌గా పొందాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ త్యాగాలను ప్రస్తావిస్తూ విద్యార్థులు కూడా అన్ని అడ్డంకులను అధిగమిస్తూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంక్‌ల ఏర్పాటు పట్ల బండి సంజయ్ ప్రశంసలు గుప్పించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని లక్ష్యంగా పెట్టుకొని చేపట్టిన ఈ కార్యక్రమానికి గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించడం గర్వకారణమన్నారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న హైమావతి (జిల్లా కలెక్టర్), గరీమా అగర్వాల్ (అదనపు కలెక్టర్), అనురాధ (పోలీస్ కమిషనర్) వంటి మహిళా అధికారులను విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. "కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు," అన్నారు.

**కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి**

కార్గిల్ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బండి సంజయ్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని స్మరించుకుంటూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ భద్రత మరింత బలపడిందన్నారు.

పిల్లలు తెల్ల కాగితంలాంటి వారు. వారిలో ఏమి నాటితే అది ఎదుగుతుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను గౌరవప్రదమైన మార్గంలో నడిపించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, మండల విద్యాధికారి బండారి మనీలాతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో ధన ప్రభావం పెరుగుతున్నది

- సిద్ధాంతాల స్థానంలో 'స్విగ్గీ పాలిటిక్స్'
- విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలి
- తెలంగాణ ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం
- జైపాల్ రెడ్డి పేరిట స్థాపించిన స్మారక పురస్కారాన్ని రచయిత మోహన్ గురుస్వామికి అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశ రాజకీయాల్లో ధన ప్రభావం పెరుగుతున్నందున ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం మరింత ఎక్కువైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్విగ్గీ తరహాలో 'ఇన్‌స్టంట్' రాజకీయాలు కాకుండా, సైద్ధాంతిక విలువలతో కూడిన రాజకీయాలు ఉండాలని అన్నారు. తత్వబద్ధమైన రాజకీయాలు గల్లంతవుతుండటం ప్రమాదకర పరిణామంగా అభివర్ణించారు. ప్రస్తుతం దేశంలో విలువలకన్నా వేగమే ముఖ్యం అన్న ధోరణి పెరిగిందని, దీనిని 'స్విగ్గీ పాలిటిక్స్'గా అభివర్ణించారు. క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం సంయుక్తంగా



నిర్వహించిన కార్యక్రమంలో, ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి గారి పేరిట స్థాపించిన స్మారక పురస్కారాన్ని రచయిత మోహన్ గురుస్వామికి సీఎం రేవంత్ స్వయంగా అందించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "జైపాల్ రెడ్డి గారు విద్యార్థి నాయకుడిగా మొదలుకుని కేంద్ర మంత్రిగా రాజకీయాల్లో అసాధారణ ముద్ర వేశారు. 1969 నుంచి 2019 వరకు సుదీర్ఘంగా ప్రజల పక్షాన పోరాడారు. పటిష్టమైన ప్రజాస్వామ్య చట్టాలు తీసుకువచ్చారు. ప్రత్యేకించి ప్రసార భారత చట్టం ద్వారా, మీడియా స్వేచ్ఛకు పునాది వేశారు." పెట్రోలియం శాఖ మంత్రిగా కీలక నిర్ణయాలు తీసుకున్న ఆయన, సమాచార శాఖ మంత్రిగా ప్రజాస్వామ్యానికి గొంతు ఇచ్చారని సీఎం కొనియాడారు.

"తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్ రెడ్డి గారి పాత్ర అతి కీలకం. కేంద్ర కేబినెట్, రాజ్యసభలో ఆయన చొరవ లేకపోయి ఉంటే తెలంగాణ సాధ్యం అయ్యేదే కాదు," అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. జైపాల్ రెడ్డి, పీవీ నరసింహారావు వంటి నేతల తత్వబద్ధమైన సేవలు నేటి రాజకీయాల్లో అతి అవసరమని అభిప్రాయపడ్డారు. "ఈరోజు రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే డెలివరీకి ప్రాధాన్యత పెరిగింది. వాలంటీర్స్ రాగా, కార్యకర్తలు గల్లంతయ్యారు. ఇది ప్రజాస్వామిక వ్యవస్థకు ప్రమాదకరం. ధన ప్రభావం తగ్గాలి. విశ్వవిద్యాలయాల్లో సిద్ధాంతబద్ధ విద్యార్థి రాజకీయాల వేదికలు తయారవ్వాలి," అని సూచించారు. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సస్మిత్ పాత్ర, క్యాపిటల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పురుశోత్తం రెడ్డి, ఐసీఎఫ్ఏఐ చైర్ పర్సన్ యశస్వీ శోభారాణి, వైస్ చాన్సలర్ ఎల్ఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. జైపాల్ రెడ్డి పేరు పదిలంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

## అత్యంత విశ్వసనీయ నేతగా మోడీ



- మార్నింగ్ కన్సల్ట్ సర్వేలో 75 శాతం మద్దతు
- ట్రంప్‌కు ఎనిమిదో స్థానం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోదీ మరో విశిష్టతను సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా మరోసారి తలెత్తారు. ప్రముఖ గ్లోబల్ డేటా సంస్థ మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన 'గ్లోబల్ లీడర్ అప్రూవల్ రేటింగ్స్' సర్వేలో ప్రధాని మోదీ 75 శాతం ప్రజామద్దతుతో మొదటిస్థానంలో నిలిచారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జాబితాలో 44 శాతంతో ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. జులై 4-10 మధ్య నిర్వహించిన ఈ సర్వే వివరాలను బీజేపీ ఐటి సెల్ నేత అమిత్ మాలవీయ ఎక్స్ (మాజీ ట్విట్టర్) లో వెల్లడించారు. "భారతదేశం ఓ విశ్వసనీయ నాయకత్వంలోని చేతుల్లో సురక్షితంగా ఉంది. ప్రపంచమంతా మోదీని నమ్ముతుంది" అంటూ మాలవీయ స్పందించారు.

**టాప్ 5 గ్లోబల్ నేతలు - అప్రూవల్ రేటింగ్:**

నరేంద్ర మోదీ (భారత్) - 75
జే-మ్యుంగ్ (దక్షిణ కొరియా) - 59
జేవియర్ మిలి (అర్జెంటీనా) - 57
మార్క్ కార్నీ (కెనడా) - 56
అంద్రూజ్ డుడా (పోలాండ్) - 53

**మోదీకి లాభించే గత సర్వేలు:**

మోదీకి గతంలోనూ గ్లోబల్ సర్వేల్లో అత్యధిక ప్రజాదరణ లభించింది.

**ఇందిరాగాంధీ రికార్డు బ్రేక్ చేసిన మోదీ**

ప్రధాని మోదీ తాజాగా భారత చరిత్రలో అత్యధిక కాలం నిరవధికంగా ప్రధానిగా కొనసాగిన రెండో వ్యక్తిగా నిలిచారు. 2014 మే 26న తొలిసారి పదవీ స్వీకారం 2025 జూలై 25 నాటికి 4,708 రోజులు పూర్తి చేసుకున్నారు. ఇందిరాగాంధీ: 4,077 రోజులు (1966 జనవరి 24 - 1977 మార్చి 24) నెహ్రూ: తొలి స్థానంలో (1947 నుంచి 1964 వరకు) ఉన్నారు.

లోక్‌సభలో వరుసగా మూడుసార్లు స్పష్టమైన మెజార్టీ సాధించి అధికారం చేపట్టిన నేతగా నెహ్రూ తర్వాత మోదీ నిలిచారు. రాష్ట్ర స్థాయిలో గుజరాత్ సీఎంగా కొనసాగిన అనుభవంతో పాటు, దేశ నాయకత్వాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న మోదీకి దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోంది.



## ఎయిర్‌పోర్టు పనులపై దృష్టి పెట్టాలి

- రివ్యూ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి, సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మామునూరు ఎయిర్‌పోర్టు పనులపై దృష్టి సారించాలనీ, పనుల్లో వేగం పెంచాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి, మంత్రులు కొండా సురేఖ, డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అధికారులను ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ పరిధిలోని జిల్లాల్లో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలనీ, జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను సీఎం ఆదేశాల మేరకు వారంలో ఒకటి, రెండుసార్లు సందర్శించాలని సూచించారు. వరంగల్ నగర అభివృద్ధి, వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై మంత్రులు సంయుక్తంగా సమీక్షించారు. అందులో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, ఎంపీ పి. బలరాం నాయిక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, నాయిని రాజేందర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, రాహుల్ శర్మ, రిజ్వాన్ భాషా షేక్, ఆయా జిల్లాల ఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. మామునూరు ఎయిర్ పోర్టు నిధులు కేటాయించి నందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వెటర్నరీ ఆస్పత్రులను కలెక్టర్లు, ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలిం చాలన్నారు. వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర సర్కారు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి డీపీఆర్, టెండర్, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకొని పనిచేయాలని సూచిం చారు. ఎయిర్‌పోర్టుకు

## ఉప్పొంగిన కృష్ణా నది

- జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణా నది ఉప్పొంగి ప్రవాహం
- ఎగువ జలాశయాల నుంచి భారీ ఇన్‌ఫ్లో - 12 గేట్ల ద్వారా నీటి విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కృష్ణా నది ఉప్పొంగిప్రవహిస్తోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి భారీగా నీరు విడుదలవుతున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి వచ్చిన ఇన్‌ఫ్లో 75,000 క్యూసెక్కులుగా నమోదు కాగా, అధికారులు అప్రమత్తమై 12 గేట్లను ఎత్తి శ్రీశైలం వైపు దిగువకు నీటిని వదిలేశారు.

ప్రస్తుతం జూరాల స్పిల్‌వే ద్వారా 47,000 క్యూసెక్కులు, పవర్‌హౌస్ ద్వారా 34,286 క్యూసెక్కులు, కొయిలసాగర్ లిఫ్ట్ ద్వారా 315 క్యూసెక్కులు, నెట్టంపాడు లిఫ్ట్ ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 480 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, పారలల్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2 ద్వారా



750 క్యూసెక్కులు చొప్పున మొత్తం 72,445 క్యూసెక్కుల వరదనీరు విడుదలవుతోంది.

జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం ఇది 317.680 మీటర్ల (1,042.257 అడుగులు) వద్ద ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ఇందులో ప్రస్తుతం 7.991 టీఎంసీలు నిల్వ ఉండగా, లైవ్ స్టోరేజ్ 4.284 టీఎంసీలుగా ఉంది.

వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు పర్యవేక్షణను మరింత కఠినంగా నిర్వహిస్తున్నారు. జూరాల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## తెలంగాణ సంస్కృతికి ఓయూ ప్రతిబింబం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విద్యాసంస్థగా నిలిచిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం రాత్రి ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవం-2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ "విచారాలే కాకుండా భావజాలాలకూ వేదిక కావాల్సింది విశ్వవిద్యాలయాలే. భావప్రకటన స్వేచ్ఛను కాపాడుకునే బాటలో ఓయూ ముందుండాలి. ప్రజా ప్రభుత్వంగా తాము తీసుకున్న నిర్ణయాల ఫలితంగా ప్రస్తుతం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి" అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలను స్కిల్ బేస్డ్ నాలెడ్జ్ హబ్‌లుగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సంస్థల ద్వారా యువతకు నైపుణ్యాల అభివృద్ధి, అధ్యాపకుల నియామకాలతో విద్యా ప్రమాణాలు మెరుగవుతున్నాయని వివరించారు. ప్రతి విద్యార్థికి ఇంటర్నేషనల్ లాంగ్వేజ్‌గా ఇంగ్లీష్ భాషలో చదివే అవకాశం కల్పించడమే లక్ష్యమని స్పష్టంచేశారు.

"దేశంలోనే మొట్టమొదటిగా సమగ్ర కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచాం. పేద బతుకులు మారాలంటే విద్యే మార్గం. విద్యను నిర్లక్ష్యం చేయవద్దు" అని యువతకు సూచించారు. విద్య, వైద్యం రంగాలపై ప్రత్యేక దృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, 104 యంగ్ ఇండియా స్పోర్ట్స్, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రారంభంతో తెలంగాణ విద్యారంగంలో కొత్త శకానికి నాంది పలికిందని చెప్పారు.



ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం మాట్లాడుతూ "ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అకడమిక్, కల్చరల్ ప్రోగ్రామ్‌లతో చైతన్యవంతంగా ఉన్నారు. ఎనిమిది నెలల్లో కళాశాల గణనీయమైన పురోగతి సాధించింది. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణాన్ని ప్రభుత్వ సహకారంతో చేపడతాం" అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి. కాశీం అధ్యక్షతన సమావేశం జరిగింది. వార్షిక నివేదికను విడుదల చేస్తూ 'ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో మంచి ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు" అని అన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో తోడ్పడ్డ వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. ఎస్. జితేందర్ నాయక్, యూజీసీ డీన్ ప్రొ. బి. లావణ్య, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ. సయద్ తలాత్ సుల్తాన, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కొండా నాగేశ్వర్ రావు, డా. బాలు నాయక్, డా. పి. స్వాతి, డా. సి.ఎస్. స్వాతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, అధ్యాపకులు-ఉద్యోగులంత్యాక్షరి విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

## బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్..

**నలుగురు నక్సలైట్లు మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో మరోసారి తుపాకుల మోత మోగింది. భద్రతా దళాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు హతమైనట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు శనివారం తెలిపారు. సాయంత్రం బీజాపూర్ నైరుతి ప్రాంతంలోని అడవిలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని, మావోయిస్టుల గురించి పక్కా సమాచారం అందిన తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ప్రారంభించాయని పోలీసులు తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని.. ఘటనాస్థలంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు %క్ష్మీమీూూూ, జూక్మ% రైఫిల్స్‌తో సహా పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్‌రాజ్ తెలిపారు. కాగా, ఈ సంవత్సరం ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు 225 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయి. బీజాపూర్, బస్తర్, కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల్లో భద్రతా దళాలు ఎక్కువగా ఎన్ కౌంటర్లు చేపట్టి.. మావోలపై విరుచుకుపడుతున్నాయి. మార్చి 31, 2026 నాటికి దేశాన్ని నక్సలిజం నుండి విముక్తి చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా భద్రతా సంస్థలను ఆదేశించిన నేపథ్యంలో మావోల ఎరివేత వేగంగా జరుగుతోంది.

# గోదావరి జలాలపై కుట్ర




- కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ యత్నం
- రేవంత్ తొత్తుల్లా పనిచేస్తున్న వారిని వదిలిపెట్టం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణకు గోదావరి జలాలు దూరం చేయాలని బనకచర్ల ప్రాజెక్టు పేరుతో కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జలహక్కులకు పిండం పెట్టే కుట్రను ఆపేందుకు కేసీఆర్ ఉన్నారని, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు దానిని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మల్లాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతల కలయికతో తెలంగాణ నీటి హక్కులపై దాడి జరుగుతోందన్నారు. "సీడబ్ల్యూసీ, పోలవరం అథారిటీ, జలమండలి అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం బనకచర్లను నిర్మిస్తోంది. ఈ కుట్రకు తెలంగాణ కాంగ్రెస్ మద్దతు ఇస్తోంది" అని ఆరోపించారు.

మిగితా 2వ పేజీలో



## నీళ్ల కోసం మరో ఉద్యమం

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గోదావరిలో తెలంగాణకు 967 టీఎంసీలు, ఏపీకి 513 టీఎంసీలు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ చర్చ సందర్భంగా ఇవి కూడా చర్చకు వచ్చాయని అన్నారు. కానీ తెలంగాణకు రావాల్సిన 967 టీఎంసీలను కూడా ఏపీ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రాసిన లేఖలను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టుపై

మిగితా 2వ పేజీలో

## ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం

**బ్రేక్‌ఫెయిల్‌తో కంటైనర్ ట్రక్కు బీభత్సం 20 కార్లు ఢీ... 19 మందికి గాయాలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం హైవేపై జవదాటల ఉద్రిక్తతను తీసుకొచ్చింది. రాయ్‌గఢ్ జిల్లాలోని ఖోపోలి సమీపంలో ఒక కంటైనర్ ట్రక్కు అదుపుతప్పి దాదాపు 20 కార్లను ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 19 మందికి గాయాలయ్యాయి.

మిగితా 2వ పేజీలో






## వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేద్దాం

- మంత్రి కొండా సురేఖ

వివరాలు 2వ పేజీలో

# వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేద్దాం

- మంత్రి కొండా సురేఖ

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రానికి వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది అని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆమె, జిల్లా అభివృద్ధి, విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్ సహా పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు.వరంగల్ జిల్లా ప్రగతికి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలన్నదే లక్ష్యంగా మంత్రి సూచనలు చేశారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్, రైల్వే ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష జరిపారు.

వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. భూసేకరణ సమస్యలేవీ లేకుండా నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని వెటర్నరీ ఆసుపత్రులను కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. ప్రజలకు మెరుగైన పశుస్వాస్థ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణ రెండో రాజధానిగా చారిత్రాత్మక వరంగల్‌ను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. "ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల ప్రతిబింబం. అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటే నగర రూపురేఖలు మారతాయి" అంటూ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోదావరి జలాలపై కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

మేడిగడ్డ వ్యవహారంలో పగుళ్ల వెనుక కుట్రలున్నాయన్న అనుమానాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు. "ఇప్పటికే శబ్దం వచ్చిందని ఎన్నికల సమయంలో పలువురు చెప్పారు. ఇప్పుడు ఆ మాటలు నిజమవుతున్నాయి. రేవంత్ కాంగ్రెస్, చంద్రబాబు కలిసి నీటిని ఆంధ్రకు అప్పగిస్తున్నారు" అని విమర్శించారు. "తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పతాక అయిన బీఆర్ఎస్‌ను పూర్తిగా కూల్చేందుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతలే కలిసి వ్యవహరిస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. "బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల వల్లే ప్రజలు ఆయనపై నమ్మకం చూపారు" అని గుర్తు చేశారు.

తెలంగాణలో కేసీఆర్ పాలన స్వర్ణయుగంగా సాగిందని, రైతు బంధు, రైతు బీమా, వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పెన్షన్ల పెంపుతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. "73,000 కోట్లతో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం చేశాడు కేసీఆర్" అని వివరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సదస్సులో విద్యార్థులు కేసీఆర్, కేటీఆర్‌ల కోసం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "వియ్ లవ్ కేసీఆర్" సెల్ఫీ పాయింట్, గులాబీ కండువాలతో ప్రాంగణం కళకళలాడింది. విద్యార్థులు ప్రాజెక్టులపై ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. బనకచర్ల వల్ల తెలంగాణకు నీటి అన్యాయం ఎలా జరుగుతుందో వివరించారు. "మూసీ ప్రక్షాళనలో

లక్షన్నర కోట్ల కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే రేవంత్ తడబడ్డారు. విద్యార్థుల పోరాటంతో లగచర్ల, కంచగచ్చిబౌలి భూ కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి" అని పేర్కొ న్నారు. విద్యార్థి విభాగానికి పెద్దపీట వేస్తామని తెలిపారు.

"విద్యార్థులు పోరాడితేనే ఉద్యమం ఫలిస్తుంది. బీఆర్ఎస్వీ అంటే కేవలం విద్యార్థి విభాగం కాదు అది తెలంగాణ హక్కుల కోసం ఫ్రంట్‌లైన్‌లో నిలిచే యోధులు" అని కేటీఆర్ అన్నారు. "సోషల్ మీడియా మా ఆయుధం. ప్రజల సమస్యలను నిస్సందేహంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి" అని పిలుపునిచ్చారు.

# నీళ్ల కోసం మరో ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వరద జలాలు అంటున్నాడని.. లెక్క తేలకుండా వాటిని ఎలా తీసుకెళ్తావని చంద్రబాబుపై హరీశ్‌రావు మండిపడ్డారు. నీళ్ల నిండుగా ఉంటే గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులను ఎందుకు వ్యతిరేకించావని చంద్రబాబును హరీశ్‌రావు నిలదీశారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీలోనే కేటాయించిన నీళ్లనే అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. కచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ 2020లోనే కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాశారని.. సముద్రంలో కలుస్తున్న 3000 టీఎంసీల గోదావరి జలాల్లో తెలంగాణకు 1950 టీఎంసీలు కేటాయించాలని కోరారని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ నీటి అవసరాలు, పరిశ్రమల కోసం వాటిని వినియోగించుంటామని లేఖలో పేర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు

టీఎంసీలు అడుగుతున్నాడు కానీ.. 400 టీఎంసీలు వినియోగించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ లెక్క తేలకుండా బనకచర్ల ప్రాజెక్టు ఎట్లా కడుతావని రేవంత్ రెడ్డి అడుగాలి కదా అని ఆయన ప్రశ్నించారు.

గోదావరి నీళ్ల లెక్క తేలకుండా, వాటా తేలకుండా రాత్రికి రాత్రి ప్రాజెక్టు కడితే తెలంగాణ ఊరుకోదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీనికి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నా తెలంగాణ సమాజం ఒప్పుకోదని అన్నారు. నీళ్ల కోసం మరోసారి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తుందని.. మరోసారి యూనివర్సిటీలు ఉద్యమ వేదికలు అవుతాయని హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్టు కోసం రేవంత్ రెడ్డి సంతకాలు పెడితే కేసీఆర్ ఊరుకోడు.. రైతులు ఊరుకోరని అన్నారు. సుప్రీంకోర్టుకైనా వెళ్తాం.. రోడ్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ వాటాలో చుక్క నీటిని వదలుకోమని స్పష్టం చేశారు.

ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని హరీశ్‌రావు అన్నారు. పోలవరం ప్రాజెక్టును కట్టి కృష్ణా పరివాహక ప్రాంతానికి నీటిని తీసుకెళ్తామని చెప్పారని తెలిపారు. 1980లో బచావత్ ట్రిబ్యునల్ 80 టీఎంసీలను కృష్ణా నదికి తరలిస్తే, నాగార్జునసాగర్ మీద ఉన్న 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలని చెప్పారని అన్నారు. ఆ 45 టీఎంసీలు మాకు ఇవ్వడానికి చంద్రబాబు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. 80 టీఎంసీల కంటే ఎక్కువ తీసుకెళ్తే ప్లోరాట ప్రకారం నీళ్లు కేటాయించాలన్నారు. 157 టీఎంసీలు తెలంగాణకు కేటాయిస్తేనే బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని స్పష్టం చేశారు. 157 టీఎంసీలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఎందుకు అడుగడని ఆయన ప్రశ్నించారు.

# ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన వారిని నవీ ముంబైలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఎలాంటి ప్రాణనష్టం మాత్రం సంభవించలేదని తెలిపారు.

ప్రమాదం ముంబై వైపు దారిలో కొత్త సొరంగం దాటి, ఫుడ్‌మాల్ హోటల్ సమీపంలో జరిగింది. రద్దీ గంటల్లో జరిగిన ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లోనావాలా ఘాట్ నుంచి కిందకు వస్తున్న ట్రక్కు బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. అదుపుతప్పిన ట్రక్కు వరుసగా వాహనాలను ఢీకొడుతూ దూసుకెళ్లింది.

### ఖరీదైన కార్లు నుజ్జు

ఈ ఘటనలో బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్ వంటి లగ్జరీ కార్లు సహా 20కి పైగా వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాహనాల ముందు-వెనుక భాగాలు నుజ్జునుజ్జయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొన్ని వాహనాలు రోడ్డుపక్కకు దూసుకెళ్లగా, మరికొన్ని ఒకదానిపై ఒకటి పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. దెబ్బతిన్న వాహనాలను క్రేన్‌ల సాయంతో తొలగించారు. నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు.ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం సేవించలేదని వైద్య పరీక్షల్లో తేలినట్టు అధికారులు తెలిపారు. బ్రేక్‌ల వైఫల్యం, ఇతర సాంకేతిక లోపాల కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశముంది.

# తోపులాటలో హౌసింగ్ బోర్డు ఉద్యోగి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

కోర్టు ఉత్తర్వులతో ఓ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేయడానికి వెళ్లిన హౌసింగ్ బోర్డ్ ఉద్యోగి అక్కడ జరిగిన తోపులాటలో ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్ మెహిదీపట్నంలోని ఆసీఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. వివరాల్లోకెళ్తే.. మెహదీపట్నం ఆర్టీసీ డిపో ముందున్న ఎంపీ ఫంక్షన్ హాల్ యాజమాన్యం ఎనిమిదేండ్లుగా హౌసింగ్ బోర్డుకు లీజు డబ్బులు చెల్లించలేదు. దాంతో దాదాపు రూ.1.50 కోట్ల బకాయి ఉండటంతో కోర్టు ఆదేశాలతో ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసేందుకు శనివారం హౌసింగ్ బోర్డు అధికారులు సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ యాజమాన్యం, కార్పొరేషన్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. అది తోపులాటకు దారితీయడంతో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ జగదీశ్వర్‌రావు స్పృహ తప్పి పడిపోయారు. తోటి ఉద్యోగులు ఆయనను సమీపంలోని దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంజినీరింగ్ సీట్లు 1.16 లక్షలు

- ఎప్‌సెట్ రెండో విడతలో ఉన్న సీట్లు 30,941
- వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో 30,941 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 1,16,877 సీట్లున్నాయి. అందులో కన్వీనర్ కోటాలో 90,921 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 59,980 మంది అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. దీంతో 30,941 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి. ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. శనివారం ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేం దుకు ఆదివారం వరకు అవకాశమున్నది. ఈనెల 30న ఎప్‌సెట్ రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

# రుసుము లేకుండా ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వండి

- సీఎస్‌కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

విద్యార్థుల ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను వారి నుంచి ఎలాంటి రుసుము డిమాండ్ చేయకుండానే ఉన్నత విద్యా సంస్థలు ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తెలిపింది. పాల్వంచలోని కేఎల్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తన ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను చట్టవిరుద్ధంగా తమ వద్దే అట్టిపెట్టుకున్నారనీ, ర్యాగింగ్, మానసిక క్షోభ సంఘటనల తర్వాత కోర్సు నుంచి వైదొలగిన యాజమాన్యం రూ.3 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ కుమారి వంగల శృతి కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదును డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన కమిషన్ పరిశీలించింది. కాలేజీ చర్యను తప్పుపట్టింది. సర్టిఫికెట్లను బలవంతంగా కాలేజీల వద్దే పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం విద్యార్థుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని తెలిపింది. యుజిసి మార్గదర్శకాలకు విరుద్ధమని తీర్పులో స్పష్టం చేసింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18 ప్రకారం తమ అధికారాల మేరకు తీర్పునిచ్చింది. ఎటువంటి రుసుము డిమాండ్ చేయకుండా వెంటనే ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను విద్యార్థినికి తిరిగి ఇచ్చేలా కళాశాలలను ఆదేశించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరింది. ఆయా కళాశాలల్లో ఈ చట్టవిరుద్ధమైన పద్ధతిని నిషేధిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఉన్నత విద్యా సంస్థలకు కట్టుబడి ఉండే సూచనలు జారీ చేయాలని సూచించింది. ఒక నెలలోపు తీసుకున్న చర్యలతో నివేదికను తమకు సమర్పించాలని సీఎస్ ను కమిషన్ ఆదేశించింది. ఈ ఏడాది ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్న హైదరాబాద్‌లో కన్వీనర్ కోటాలో సీటు పొందే అవకాశమున్న శృతికి వెంటనే సర్టిఫికెట్లను అందజేయాలని సదరు కాలేజీని కమిషన్ ఆదేశించింది. రాబోయే ఆగస్టులో మొదటి వారంలో ఎప్‌సెట్‌కు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉందని గుర్తుచేసింది.

# డివైడర్‌ను ఢీకొట్టిన స్కార్పియో

- ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు మృతి
- అడిషనల్ ఎస్పీకి, డ్రైవర్‌కు గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో దాన్ని తప్పించే క్రమంలో స్కార్పియో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు డీఎస్పీలు మృతిచెందారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం జాతీయ రహదారి -65పై శనివారం జరిగింది. చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు స్కార్పియో వాహనంలో శనివారం ఉదయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం వచ్చేసరికి జాతీయరహదారిపై ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాన్ని తప్పించే క్రమంలో వేగంగా ఉన్న స్కార్పియో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనం నుజ్జునుజ్జవ్వడంతో స్కార్పియోలో ఉన్న డీఎస్పీలు చక్రధర్‌రావు, శాంతారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డ్రైవర్ నర్సింగ్‌రావుకు గాయాలయ్యాయి. వారిని వెంటనే హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు ప్రమాణ స్వీకారం

**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతి రాజు గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. పీఎస్ శ్రీధరన్ పిళ్లై స్థానంలో ఆయన ఆ బాధ్యతలను స్వీకరించారు. శనివారం గోవా రాజధాని పనాజీలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముంబయి హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే గజపతిరాజు చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో పాటు కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఏపీ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అశోక్ గజపతిరాజును ఏపీ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను కూడా మంత్రి లోకేశ్ సత్కరించారు. అశోక్ గజపతి రాజు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయవేత్తగా ఆయనకు వివాదరహితుడిగా పేరుంది. గతంలో ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. 2014లో విజయనగరం ఎంపిగా గెలుపొందారు. మోడీ క్యాబినెట్‌లో విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మహారాజా అలక్‌నారాయణ విద్యాసంస్థలను అశోక్ గజపతి రాజు నిర్వహిస్తున్నారు. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా అశోక్ గజపతి రాజు చేశారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు కేబినెట్‌లలో కీలక మంత్రిత్వ శాఖలను ఆయన చేపట్టారు.



## వెలవెల బోతున్న శ్రీ రాజరాజేశ్వర జలాశయం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ వద్ద ఉన్న శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేరు) జూలై మాసం పూర్తికావస్తున్న నీరు లేక వెలవెలబోతుంది. శ్రీ రాజరాజేశ్వర జలాశయం పూర్తిస్థామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.953 టీఎంసీలు నీరు మాత్రమే నిల్వ ఉంది. వర్షాకాలం మొదలైన నుండి సరైన వర్షాలు కురువకపోవడంతో జలశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజ్ కి పడిపోతుంది. ఇటీవల కొన్నిచోట్ల భారీ వర్షాలు కురవగ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మామూలుగా వర్షం కురవడంతో కేవలం మూలభాగం నుండి 955 క్యూసెక్కుల నీరు మాత్రమే జలాశయంకు వచ్చి చేరుతుంది

## కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో
## ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు...



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు పై నిర్వహించిన స్టాట్యూ కమిటీ సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య జయశంకర్ చిత్రపటం ఉందని, అవకాశం ఉన్నచోట విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గంభీ రావు పేట మండలం నమాజ్ చెరువు వద్ద ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ విగ్రహ ఏర్పాటు గురించి చర్చించి,ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెరువు ఎఫ్టిఎల్ లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేనందున జయశంకర్ విగ్రహం ఏర్పాటు కుదరదని అన్నారు.

స్టాట్యూ కమిటీ సభ్యులు అంగీకారం మేరకు గంభీరావు పేట మండలంలో ఉన్న కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు, దీనికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను రోడ్లు భవనాల శాఖ అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్ అండ్ బి ఈ నరసింహ చారి, ఈఈపిఆర్ సుదర్శన్ రెడ్డి, ఈఈ ఇరిగేషన్ కిషోర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సిరిసిల్ల పద్మశాలి ఎన్నికలకు బ్రేక్

### కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేసిన సంఘ సభ్యులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నిర్వహించిన ఎన్నికల నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఉగాది సంఘం సభ్యులు చిమ్మని ప్రకాష్, కోడం రవి లు జిల్లా కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఎన్నికలను నిలిపివేయాలని ఆదేశించింది. ఈ పరిణామం పట్ల మధ్యతరగతి పద్మశాలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా, పట్టణ పద్మశాలి సంఘం నాయకులు న్యాయవాదులు సంగీతం సత్య సాయిరాం, భరత్ కుమార్ లతో కలిసి స్థానిక ప్రెస్ క్లబ్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పద్మశాలి పెద్దల సంఘం నాయకుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. నామినేషన్ ఫీజులు తగ్గించాలని ఎన్నిసార్లు కోరినా పెద్దలు స్పందించలేదని, బైలాకు వ్యతిరేకంగా జరుగుతున్న ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చినా స్పందన కనబడలేదని పేర్కొన్నారు. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. న్యాయస్థానం మధ్యతరగతి పద్మశాలీలకు అనుకూలంగా తీర్పునివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేసిన నాయకులు, ఎన్నికలను రద్దుచేసి, బైలాకు అనుగుణంగా, పద్మశాలి సభ్యుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా పెద్దలు ఆలోచించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ రోజు జరిగిన తీరును కూడా వారు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా పెద్దలు స్పందించి, అన్ని సంఘాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి, మళ్ళీ కొత్తగా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు బ్రేక్ పడటం వల్ల సిరిసిల్ల పట్టణ పద్మశాలీలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిమ్మని ప్రకాష్, కోడం రవి, రిక్కు మల్ల మనోజ్ కుమార్, కొండ ప్రతాప్, గుజ్జే శివరాం, నాగుల శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, గజ్జెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారా మాత్రమే పేదరికం నిర్మూలన సాధ్యం..

### సిరిసిల్ల జిల్లా కలెక్టర్ పని తీరును ఫోన్ ద్వారా ప్రశంసించిన బీసి, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

విద్య ద్వారా మాత్రమే పేదరికం తగ్గిపోతుందని బలంగా విశ్వసిస్తూ, పేదలు అధికంగా ఉండే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. ఇల్లంతకుంట మండలం రహింఖాన్ పేట గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు.

మాడల్ స్కూల్ లో విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే మ్యాథ్స్, తెలుగు, అకౌంటింగ్ ఇంగ్లీష్ పాఠాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలు రాబట్టారు.కిచెన్ షెడ్డు ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం రుచిగా వండి వడ్డించాలని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఏ జిల్లాలో లేనివిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ చొరువతో ప్రత్యేకంగా ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న బీసి రవాణా శాఖ మంత్రి వర్యులు పోన్నం ప్రభాకర్ సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ను ఫోన్ ద్వారా అభినందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామని అన్నారు. ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని,విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు.

కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని విజయవంతం కావాలని విద్యార్థులకు సూచించారు.

శనివారం, ఆదివారం, సెలవు రోజుల్లో కూడా విద్యార్థులు కొంత సమయం చదువు కోసం వెచ్చించాలని అన్నారు. గ్రాడ్యుయేషన్ మంచి కళాశాలలో చేసేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం బాగా చదువుకుంటేనే జీవితం బాగా ఉంటుందని అన్నారు. అనంతరం పాఠశాలలో మోటర్ సమస్య ఉందని దృష్టికి అధికారులు తీసుకొని రాగా, అవసరమైన 1.5 హెచ్.పి మోటర్ , ఇతర అవసరాలకు, మరమ్మతులకు, సమస్యలు పరిష్కారానికి నిధులను మంజూరు చేస్తామని అన్నారు..అనంతరం దివ్యాంగుల ఆర్థిక పునరావాసం క్రింద డి.భాగ్యలక్ష్మి , ఇల్లంతకుంట బ్యాంగిల్ స్టోర్స్ కంగన్ హాల్ పెట్టుకోవడం కోసం రూపాయలు 50,000 నాన్ బ్యాంకింగ్ 100% సబ్సిడీతో కూడిన లోన్ మంజూరు చేసి చెక్ అందచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్ ఎంపీడీవో కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహాసభలను జయప్రదం చేయండి..

### బీడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షులు ముశం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




అమృత్లాల్ శుక్ల కార్మిక భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ.. ఈనెల 27వ తేది ఆదివారం రోజున సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా మహాసభలు జరుగుతున్నాయి. ఇట్టి మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి బీడీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా బీడీ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమా, రాష్ట్ర అధ్యక్షులు గోపాలస్వామి లు హాజరవుతున్నారు.ఈ మహాసభలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఈ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది ఎన్నికల సందర్భంగా 4000 పెన్షన్ అమలు చేస్తానని ఇప్పటికి కూడా అమలు చేయకుండా పోయింది. బీడీ కార్మికులను విపరీతంగా దోపిడీ చేస్తున్న కంపెనీ యజమానులపై ఎలాంటి చర్యలు ప్రభుత్వం తీసుకోకపోవడంతో బీడీ కంపెనీలో బీడీ కంపెనీ యజమాన్యం విపరీతమైన దోపిడీకి పాల్పడతా ఉంది ప్రతి కార్మికుల నుండి కంపెనీ యజమానులు 2000 కూలీని దోచుకుంటున్నారు అనేక రకాల పేర్లతో కార్మికుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో బీడీల నుండి ఆదాయం వస్తున్న కూడా బీడీ కార్మికులకు పనికి తగ్గ వేతనం నిర్ణయించడం లేదు. రాబోయే కాలంలో బీడీ కార్మికులందరికీ పిఎఫ్ తో సంబంధం లేకుండా నాలుగు వేల పెన్షన్ అమలు చేయాలని కనీస వేతనం 1000 బీడీలకు 600 రూపాయలు చెల్లించాలని ప్రతి ఒక్క బీడీ కార్మికులకు పీఎఫ్ అమలు చేయాలని 2000 బీడీల కోత విధించకుండా చేయాలని 26 రోజుల పని కల్పించాలని బీడీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నాణ్యమైన ఆకు, తంబాకు అందించాలని ముశం రమేష్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్ చంద్ర, జిందన్ కమలాకర్, దాసరి రూప, బేజిగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టల ప్రదర్శన..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో దత్తత గ్రామం అయిన తంగళ్ళపల్లి మండలంలోని రాళ్ళపేట గ్రామంలో పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు రైతులకు పసుపు రంగు జిగురు అట్టల వాడకంపై అవగాహన కల్పించారు. పత్తి పంటను దెబ్బతీసే తెల్ల దోమలు, తామర పురుగులు, ఇతర రసం పీల్చు పురుగులను ఆకర్షించి పట్టుకునేలా ఈ అట్టలు రూపొందించబడ్డాయని వివరించారు. రసాయనిక మందులపై ఆధారపడకుండా, పర్యావరణానికి మేలుగా ఉండే ఈ పద్ధతిని రైతులు స్వీకరించాలని సూచించారు. ఎకరానికి 10 అట్టలు అమర్చితే, పురుగులు ఆకర్షించబడి జిగురుకు అంటుకుని చనిపోతాయని తెలిపారు. ఇది పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించడంలో దోహదపడుతుందని వారు చెప్పారు.




## ఇండియా ఛాంపియన్స్‌కు నిరాశ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 టోర్నీలో భారత్‌కు వరుసగా రెండో పరాజయం చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో యువరాజ్ సింగ్ సారథ్యంలోని ఇండియా ఛాంపియన్స్ జట్టు, ఆస్ట్రేలియా ఛాంపియన్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఇది భారత్‌కు ఈ టోర్నీలో రెండో పరాజయం కావడం గమనార్హం.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఇండియా ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 203 పరుగులు చేసింది. ఓపెనర్ శిఖర్ ధావన్ (60 బంతుల్లో 91బీ 12 ఫోర్లు, 1 సిక్స్) మళ్లీ అద్భుతంగా ఆడగా, యూసఫ్ పఠాన్ (23 బంతుల్లో 52 నాటౌట్‌బీ 3 ఫోర్లు, 4 సిక్సులు) మెరుపు హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రాబిన్ ఊతప్ప (37), పర్వాలేదనిపించగా, అంబటి రాయుడు (0), సురేశ్ రైనా (11), యువరాజ్ సింగ్ (3) పూర్తిగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో డాన్ క్రిస్టియన్ (2/34) రాణించగా, బ్రెట్ లీ, డీ ఆర్సీ షాట్ చెరో వికెట్ తీశారు.

204 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఛాంపియన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కాలమ్ ఫెర్గూసన్ (38 బంతుల్లో 70బీ 5 ఫోర్లు, 4 సిక్సులు) కీలక హాఫ్ సెంచరీ చేయగా, డాన్ క్రిస్టియన్ (39) తోడయ్యాడు. భారత బౌలర్లలో పియూష్ చావ్లా (3/36) మూడు వికెట్లు తీసి బాగానే రాణించినా, విజయాన్ని కాపాడలేకపోయాడు. హర్భజన్ సింగ్ (2/33), వినయ్ కుమార్ (1/47) చెరో వికెట్ తీసారు.



## హంపి-దివ్య దేశ్‌ముఖ్ పోరు మొదలు

- **డ్రాగా ముగిసిన తొలి రౌండ్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఫిడే మహిళల చెస్ వరల్డ్‌కప్ 2025 ఫైనల్ భారత్‌కు చెందిన ఇద్దరు గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఆసక్తికరంగా ప్రారంభమైంది. శనివారం జరిగిన తొలి గేమ్ డ్రాగా ముగిసింది. తెలుగు తేజం కోనేరు హంపి నల్లపావులతో, 18 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ తెల్లపావులతో బోర్డుపై తలపడ్డారు. ఈ క్లాసికల్ గేమ్‌లో ఇద్దరూ విజయం కోసం పోటీపడ్డారు. అనుభవంలో దిట్ట అయిన హంపిని దివ్య దేశ్‌ముఖ్ తన మేటి రక్షణా వ్యూహాలతో సమర్థవంతంగా నిలువరించింది. హంపి ప్రణాళికలకు తగిన ప్రతిఉత్తరాలిస్తూ గేమ్‌ను డ్రా చేసింది. చివరి వరకు అతి జాగ్రత్తగా గేమ్ కొనసాగించడంతో గెలుపు తేలకుండానే గేమ్ ముగిసింది.

ఆదివారం రెండో గేమ్ జరగనుండగా, అది కూడా డ్రాగా ముగిస్తే సోమవారం టై బ్రేక్ ద్వారా విజేతను తేల్చనున్నారు. గేమ్ ఫలితంపై భారత ప్రేక్షకుల మధ్య ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలిచినా ఛాంపియన్ టైటిల్ భారత్‌కే వస్తుండటం గర్వకారణం. అంతేకాదు, విజేతగా నిలిచిన వారు ఈ టైటిల్‌ను సాధించిన తొలి భారత మహిళగా చరిత్రలో నిలవనుంది.

## ముక్కోణపు టీ20 సిరీస్ విజేతగా న్యూజిలాండ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




జింబాబ్వే వేదికగా జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు గెలుచుకుంది. శనివారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఉత్కంఠ భరిత ఫైనల్లో కివీస్ 3 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి ట్రోఫీని తమ ఖాతాలో వేసుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. లిలిరచిన్ రవీంద్ర (47), డెవాన్ కాన్వే (47)లిలిలు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. దీంతో దక్షిణాఫ్రికాకు 181 పరుగుల లక్ష్యం ముందుంది. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు చివరి వరకూ పోరాడినా.. 20 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 177 పరుగులకే పరిమితమైంది. ముఖ్యంగా చివరి ఓవర్‌లో విజయం కోసం అవసరమైన 7 పరుగులు సాధించడంలో దక్షిణాఫ్రికా విఫలమైంది. మాథ్యూ హెన్రీ వేసిన ఆఖరి ఓవర్‌లో కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి, లిలిబ్రెవిస్ (31), లిండె (10) లను పెవిలియన్‌కు పంపాడు.ఈ విజయంతో న్యూజిలాండ్ జట్టు టైటిల్‌ను గెలుచుకకుంది.

# డ్రా కోసం పోరు....!

- **669 పరుగులకు ఆలౌటైన ఇంగ్లండ్**
- **రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 174-2**
- **137 పరుగుల వెనుకంజలో భారత్**
- **ఆదుకుంటున్న గిల్, రాహుల్**




**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో భారత్ ఓటమి ముప్పు నుంచి తప్పించుకోవడానికి తీవ్రంగా పోరాడుతోంది. శనివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 63 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. ఇంకా ఇంగ్లండ్‌కు 137 పరుగుల వెనుకంజలో ఉంది. ఒక్క పరుగు కూడా చేయకముందే ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0) డకౌట్ కావడంతో భారత ఇన్నింగ్స్ కుదేలైంది. ఇంగ్లండ్ బౌలర్ క్రిస్ వోక్స్ తన తొలి ఓవర్‌లోనే ఈ ఇద్దరిని స్లిప్ క్యాచ్‌లుగా ఔట్ చేసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే మూడో వికెట్‌కు కేఎల్ రాహుల్ (87 నాటౌట్ - 210 బంతుల్లో 8 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (78 నాటౌట్ - 167 బంతుల్లో 10 ఫోర్లు) కలిసి అద్భుతంగా ఆడి 174 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీ మరోసారి భారత్‌కు ఉపశమనం కలిగించింది. ఇప్పటికీ భారత్ 137 పరుగుల వెనుకబడివుండగా... ఈ మ్యాచ్‌లో డ్రా సాధించాలంటే చివరి రోజు వికెట్లు కోల్పోకుండా ఆడాల్సిన అవసరం ఉంది. ఇంగ్లండ్ విజయం సాధించాలంటే ఇంకా 8 వికెట్లు తీయాల్సి ఉంది.

అంతకుముందు నాలుగో రోజు ఇంగ్లండ్ 544/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆట ప్రారంభించి 157.1 ఓవర్లలో 669 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ 198 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 141 పరుగులు చేయగా, బ్రైడన్ కార్స్ 54 బంతుల్లో 47 పరుగులు చేశాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4/134తో అత్యుత్తమ ప్రదర్శన చేసినప్పటికీ, ఇంగ్లండ్ భారీ స్కోరు నమోదు చేయడాన్ని ఆపలేకపోయారు. బుమ్రా (2/112), వాషింగ్టన్ సుందర్ (2/107), అన్షుల్ కంబోజ్, మహమ్మద్ సిరాజ్ తలో వికెట్ తీశారు.








## ‘కింగ్‌డమ్’ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘కింగ్‌డమ్’ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో చిత్రయూనిట్ ప్రమోషన్ల జోరుపెట్టింది. ఇప్పటికే ‘కింగ్‌డమ్ బాయ్స్’ పేరుతో డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి, విజయ్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలిసి విడుదల చేసిన పాడ్‌కాస్ట్ సోషల్ మీడియాను హద్దులు దాటుతోంది. ఇదిలా ఉండగా, తాజాగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, నేపథ్య సంగీతం, విజయ్ మాస్ లుక్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. ‘కింగ్‌డమ్’ విజయ్ కెరీర్‌లో మరో హిట్ అవుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

## రీ-రిలీజ్‌కు ‘అతడు’ సిద్ధం

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్‌లో రీ-రిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతున్న వేళ, సూపర్ స్టార్ మహేశ్ బాబు - త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో 2005లో వచ్చిన సూపర్ హిట్ మూవీ ‘అతడు’ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. జయభేరి ఆర్ట్స్ పతాకంపై మురళీమోహన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ, సినిమా తాలూకు మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. “అతడు సినిమాలో ఎందుకు నటించలేదు?” అనే ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. “సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలి రోజుల నుంచే మా ఆవిడ ఓ కండిషన్ పెట్టింది. ఎవరి వద్దకు వెళ్లి పాత్ర అడగకూడదు అని స్పష్టంగా చెప్పింది. అప్పటి నుంచి వచ్చిన పాత్రలకే పరిమితమయ్యాను. అందుకే ‘అతడు’లో నాకు పాత్ర ఇవ్వకపోయినా, నేను కోరలేదు కూడా. అదే నియమాన్ని ఇప్పటికీ పాటిస్తున్నాను,” అని మురళీమోహన్ వెల్లడించారు. అంతేకాదు, అతడు చిత్రానికి సీక్వెల్ తీయాలన్న ఆసక్తి కూడా తనకు ఉందని పేర్కొన్నారు. “మహేశ్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ ఓకే అంటేనే అతడు-2 సినిమా చేస్తాను. వాళ్లిద్దరితో కాకుండా వేరే వాళ్లతో అయితే తీసే ప్రసక్తే లేదు” అని మురళీమోహన్ స్పష్టం చేశారు. తాజా టెక్నాలజీతో మరింత పక్కాగా మిక్స్ చేసి, మంచి విజువల్స్‌తో ‘అతడు’ రీ-రిలీజ్ కాబోతుండటంతో మహేశ్ అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

## ఆగస్ట్ 1న ‘సార్ మేడమ్’

**బలగం టీవీ, హైదరాబాద్**




తమిళ నటుడు విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డ్ విజేత నిత్యా మీనన్ జంటగా నటించిన చిత్రం ‘తలైవన్ తలైవి’ తమిళంలో ఇటీవల విడుదలైంది. ఈ సినిమాను తెలుగులో ‘సార్ మేడమ్’ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు పాండిరాజ్ దర్శకత్వం వహించగా, సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించగా, టీజీ త్యాగరాజన్ సమర్పించారు. తమిళంలో శుక్రవారం విడుదలైన ఈ సినిమా, అనుకోని కారణాల వల్ల తెలుగులో వాయిదా పడింది. అయితే తాజా ప్రకటన ప్రకారం ఈ చిత్రాన్ని ఆగస్ట్ 1న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. విజయ్ సేతుపతి - నిత్యా మీనన్ ఇందులో భార్యాభర్తలుగా నటిస్తున్నారు. పెళ్లి జీవితంలో మొదట అన్యోన్యతగా సాగిన ఈ జంట మధ్యలో దూరమవుతూ, ప్రతి విషయంలో విభేదాలు తలెత్తటం.. వాటి ప్రభావం వారి వైవాహిక జీవితంతో పాటు బిజినెస్‌పై ఎలా పడుతుంది? అన్నదే ఈ సినిమా కథాంశం. రియలిస్టిక్ ఎమోషన్స్, న్యాచురల్ పెర్ఫార్మెన్స్‌లతో సినిమా ఆకట్టుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు చిత్ర బృందం.